బడ్జెట్ 'బడాయే'

» రాష్ట్ర ప్రభుత్వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అంతా గొప్పలదిబ్బ

» నవరత్నాల పథకాల ఏకరువు మినహా ఒరిగింది శూన్యం

» జిల్లాలో పెండింగ్ పనులు, సీఎం హామీల అమలుకు నిధుల విదిలింపులు నిల్

» ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకీకరణలకు పైసల కేటాయింపు ఊసేలేదు

» ఇంకా పునాదులే పడని మూలపేట ఓడరేవు నిర్మాణం జరిగిందంటూ డప్పు

» ఉప్పాడ ఓడరేవు నిధుల కొరతతో మూలుగుతుంటే శరవేగమని గొప్పలు



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో నాలుగున్నరేళ్ల పాలన గురించి గొప్పగా డబ్బా కొట్టుకోవడం మినహా బుధవారం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో జనాలకు ఒరిగిందేంలేదు. ఏ పద్దు చూసినా స్వోత్కర్షేగానీ పైసల కేటాయింపులు లేవు. నవరత్నాలు, సాధారణ సంక్షేమ పథకాలకు చేసిన కేటాయింపుల బడాయే తప్పించి కొత్తగా ప్రవేశపెట్టిందేం లేదు. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాకు ఈ బడ్జెట్‌తో ఒరిగింది శూన్యం. వాస్తవానికి జిల్లాలో ఏలేరు ఆధునికీకరణ, సుద్దగెడ్డ పనులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులేవైనా ఉంటాయేమోనని అంతా ఎదురుచూశారు. తీరా వ్యవసాయానికి అంత చేశాం.. ఇంత చేశాం అన్న గొప్పలేగానీ ఈ పనులకు ఏ విదిలింపులు లేవు. దీంతో కొత్త ప్రభుత్వం వచ్చాకే వీటికి మోక్షం అన్న సంకేతాలను జగన్ సర్కారు ఇచ్చినట్లయింది. వాస్తవానికి జిల్లాలో ఏలేరు ఆధునికీకరణ పనులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చకచకా కదిలాయి. మొదటి దశ ఆధునికీకరణ చివరి వరకు వచ్చేసింది. తీరా జగన్ సర్కారు వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో వీటిని రద్దు చేసేసింది. అప్పటి నుంచి నాలుగున్నరేళ్లు అవుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు. దీంతో అన్నదాతలను ఏటా వరద ముంపుతో నరకం చూస్తున్నారు. రెండేళ్ల కిందట గొల్లప్రోలు వచ్చిన సీఎం ఏలేరు ఆధునికీకరణ మొదటిదశ పనుల పూర్తికి రూ.142 కోట్లు, రెండోవిడతలో ఏలేరు, సుద్దగెడ్డ ఆధునికీకరణకు రూ.150కోట్లు నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. ఏ బడ్జెట్‌లోను నిధులు విదల్చలేదు. చివరికి ఈసారి కూడా అతీగతీ లేకుండాపోయింది. ఇదేకాదు సీఎం జగన్ ఇచ్చిన హామీలకు సంబంధించి ఏ విదిలింపులు లేవు. తాండవ ప్రాజెక్టు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించినా దీనికి కూడా నిధులు లేక టెండర్ దశ కూడా పనులు దాటలేదు. ఏలేరు-తాండవ కాలువల అనుసంధానం చేసే ఈప్రాజెక్టుకు రూ.470కోట్లు అవసరం. సీఎం జగన్ 2022 డిసెంబర్‌లో దీనికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇది పూర్తయితే జిల్లాలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వందల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోవడం మానేసింది. మరోపక్క మూలపేటలో ఓడరేవు నిర్మాణం జరిగిందని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇక్కడ బెర్త్‌ల నిర్మాణమే జరగలేదు. పైగా ఈ ఓడరేవు సెజ్‌లో భాగంగా అరబిందో సంస్థ సొంతంగా నిర్మిస్తోంది. దీనికి ప్రభుత్వంతో సంబంధం లేదు. కానీ తమ ఘనతగా బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం ప్రస్తావించడం విశేషం. మరోపక్క ఉప్పాడ హార్బర్ గురించి ప్రస్తావిస్తూ శరవేగంగా పనులు జరుగుతున్నట్లు డబ్బా కొట్టారు. దీనికి రూ.422కోట్లు ఇవ్వాల్సి ఉన్నా జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా మూడున్నరేళ్లు తాత్సారం చేసింది. దీంతో పనులు సగం కూడా అవకుండా పడకేశాయి. కానీ గతేడాది దీన్ని ప్రారంభిస్తున్నట్లు మూడుసార్లు జగన్ సర్కారు తేదీలు ప్రకటించింది. కానీ ఇదెప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఉప్పాడ జాంధానీ చీరలకు కేంద్రం ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కింద అవార్డు ప్రకటించిందని బడ్జెట్‌లో గొప్పలు చెప్పారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తరపున దీనికోసం పెద్దగా చేసిందేంలేదు. బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి పర్యాటక కేటాయింపుల గురించి ప్రకటన లేదు. బీచ్‌రోడ్డులో యుద్ధవిమాన మ్యూజియం నిధుల కొరతతో అల్లాడుతోంది. కానీ ప్రభుత్వం పట్టించుకోక ఈసురోమంటోంది. వివిధ పథకాల పేరుతో బటన్ నొక్కుతున్నట్లు పేర్కొన్న ప్రభుత్వం బటన్ నొక్కినా ఖాతాల్లో డబ్బులు జమవక లబ్ధిదారులు పడుతున్నట్లు బాధల గురించి మాత్రం తెలియనట్లే నటించింది.

వైసీపీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్



కాకినాడ సిటీ: రాష్ట్రంలో వైసీపీ అరాచక ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి మరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశమే లేదు. ఆఖరి బడ్జెట్‌లోను అందినకాడికి దోచుకోవడానికి ఈ దోపిడీ ప్రభుత్వం తెరలేపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ తాత్కాలిక బడ్జెట్‌లో సామాన్యుడి ఊసేలేదు. దోచుకోవడానికి, దాచుకోవడానికి ఆఖరి అవకాశంగా బడ్జెట్‌లో అంశాలున్నాయి.

- వనమాడి కొండబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

బడ్జెట్‌లో పేదోడితో దోబూచులాట



కాకినాడ సిటీ: తాత్కాలిక బడ్జెట్ పేదోడితో దోబూచులాటలా ఉంది. రానున్నరోజుల్లో దిగిపోయే ప్రభుత్వం మొదటి మూడు, నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం సామాన్యుడిని మభ్యపెట్టడమే. రాష్ట్రంలో సుపరిపాలన లేదు. దగా, దోపిడీ పాలనే సాగింది. ఆరిపోయే దీపానికి వెలుతురెక్కువ అన్నట్లుబడ్జెట్‌లో అంకెలు భారీగా చూపారు.

-ఆకుల వెంకటరమణ, ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

యువతను మోసం చేసిన రాష్ట్ర బడ్జెట్



కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతను మరోసారి మోసం చేసింది. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపే లేదు. భవన నిర్మాణ కార్మికులకు నిధులు శూన్యం. పేరు గొప్ప-ఊరు దిబ్బ లాగా తాత్కాలిక బడ్జెట్ ఉంది. కొత్త మెడికల్ కాలేజీల కే టాయింపులు ఎక్కడా కనిపించలేదు. అప్పులతో రాష్ట్రం ఉంటే సంపన్న రాష్ట్రంగా మంత్రి అలా వ్యాఖ్యానించడం విడ్డూరం. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయింది.

- తాలిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

బడ్జెట్... ఎన్నికల కరపత్రం



జగ్గంపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ఎన్నికల కరపత్రంలా ఉంది. తిరిగి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడానికి అంకెల గారడీ చేశారు. సంపన్న ఆంధ్ర, సుపరిపాలన ఆంధ్ర, మహిళా మహారాణి ఆంధ్ర అంటూ గొప్పలు చెప్పుకున్నారు. అంబేడ్కర్ పేరు చెప్పి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారు. అప్పులు చేస్తే గానీ ఉద్యో గులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రత్యేకహోదాపై కేంద్రానికి తలొగ్గి రాష్ట్రానికి అన్యాయం చేశారు.

-కర్నాకుల వీరాంజనేయులు, రైతు కూలీ సంఘం నేత

అంకెల గారడీ బడ్జెట్



సర్పవరం జంక్షన్: ఓట్ ఆన్ బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. నాలుగేళ్లుగా ఇదే తరహాలో నాలుగు బడ్జెట్లు ఉన్నాయి. కేవలం బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే ఆర్థిక మంత్రి కనిపిస్తారు. అదీ కూడా సీఎం జగన్ చెప్పిన రీతిలో బడ్జెట్ ఉంది. ఇది మోసకార బడ్జెట్. దాచుకో.. దోచుకో.. అన్న రీతిలో కావాల్సిన వాటికి కేటాయింపులు చేసుకుంటారు. గత నాలుగు బడ్జెట్లు ఇలానే ఉన్నాయి. పరిపాలన విధానం తెలియదు.

-పంతం నానాజీ, జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరిక

» గండేపల్లి మండలం మురారిలో జ్యోతుల సమక్షంలో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్ సహా ఆరుగురు వార్డుసభ్యులు



పార్టీలోకి చేరిన వారితో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, ఫిబ్రవరి 7: వైసీపీ పాలనలో ప్రజలు విసుగుచెంది ఉన్నారని, ఎప్పుడు ఇంటికి పంపించేద్దామని సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గండేపల్లి మండలంలోని మురారి గ్రామానికి చెందిన సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, వైసీపీ మండల యువ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, ఆరుగురు వార్డు సభ్యులతో కలిసి 1000మందితో వైసీపీ నుంచి నెహ్రూ, నవీన్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వారికి గజమాలతో అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ, నవీన్ మాట్లాడుతూ పాత, కొత్త కలయికలతో కలిసికట్టుగా పనిచేసి టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎక్కడ చూసినా రౌడీ రాజకీయాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులు చేశారన్నారు. ఇప్పుడే భయాన్ని వీడి ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి చేరుతున్నారన్నారు. టీడీపీ, జనసేన కలయికతో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. వైసీపీ తప్పుడు పాలనలతో ప్రజలు విసిగి చెంది ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ కోట ఖాళీ అవుతుందని జెండా మోసే వాళ్లు కూడా ఎవరూ ఉండరన్నారు. పార్టీలో చేరిన వసంత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీకి ఎక్కువ మెజార్టీ వచ్చేలా కృషి చేస్తానన్నారు. వైసీపీ పాలన ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు కోర్పు సాయితేజ్, కందుల చిట్టిబాబు, తోట రవి, సుంకవిల్లి రాజు, శీలామంతుల వీరబాబు, చంద్రాల మల్లేశ్వరరావు, వెంకన్నదొర, కంటే సురేష్, జీను మణిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

ఊరించారు.. ఉసూరుమనిపించారు

» మెగా కాదు.. మినీ డీఎస్సీ

» జిల్లాలో ఎస్జీటీ ఉద్యోగాలు 108 మాత్రమే

» డీఎస్సీపై తీవ్రమైన అసంతృప్తిలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు



కాకినాడ రూరల్, ఫిబ్రవరి 7: వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే మెగా డీఎస్సీతోపాటు ప్రతిఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తానని పాదయాత్ర చేసినపుడు నిరుద్యోగులకు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇది ఇప్పటివరకు హామీల విషయం గుర్తుకురాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల తొమ్మిది నెలలు దాటిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఎన్నికల సమయం కావడంతో డీఎస్సీ అంటూ హడావిడి చేస్తోంది. ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నిరాశే మిగిల్చింది. రాష్ట్రవ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం పెట్టి ఆమోదించారు. బుధవారం పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. జిల్లాలో ఒక లక్షకుపైగా బీఈడీ, డీఈడీ అభ్యర్థులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. దీనిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఎస్జీటీ పోస్టులు 108, స్కూల్ అసిస్టెంట్లు 182, టీజీటీలు 102 కలిపి మొత్తం 392 వరకూ ఉన్నట్లు తెలిసింది. వాటిలో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టులవారీగా ఎన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయనే సమాచారం తెలిపేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు అనాసక్తి కనబరచడం గమనార్హం.

● 117 జీవోతో తగ్గిన ఉపాధ్యాయ పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 117 జీవోతో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం కుదించింది. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించిన నేపథ్యంలో ఎస్జీటీ పోస్టులను భారీ ఎత్తున కోల్పోవాల్సి వచ్చింది. పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ ప్రక్రియతో కూడా పోస్టులు బాగా తగ్గాయి. తాజా నోటిఫికేషన్‌తో నిరుద్యోగులకు ఎటువంటి ఉపయోగం లేదని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

● అప్రెంటిస్‌షిప్ విధానం అమలు

నూతనంగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు అప్రెంటిస్‌షిప్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ విధానం ఉండేది దీని ప్రకారం ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు మొదటి ఏడాది రూ.1200, రెండోఏడాది రూ.1500 వేతనం ఇచ్చేవారు. మూడో ఏడాది అప్రెంటిస్‌షిప్ ముగుస్తుండడంతో మినిమం టైమ్ స్కేల్‌తో పూర్తి వేతనాన్ని ఇవ్వనున్నారు. గతంలో ఉన్న ఈ పద్ధతిపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేయడంతో 2010లో అప్పటి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. ఇదే విధానాన్ని మళ్లీ వైసీపీ కొనసాగించడంపై నిరుద్యోగులు భగ్గుమంటున్నారు.

వెబ్ కాస్టింగ్ విధానంలో ఎన్నికల పోలింగ్ పరిశీలిస్తాం

» రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ విధానంలో పరిశీలిస్తామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికాశుక్లా- ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా-2024, పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు, ఈ-ఎపిక్ కార్డుల పంపిణీ, ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటింగ్ విధానం వంటి అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామన్నారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. గత జనవరి 27న ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో జిల్లావ్యాప్తంగా 15,99,065మంది ఓటర్లు ఉండగా ఫిబ్రవరి 6 నాటికి 15,99,985మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకటేశ్వరరావు, రవికిరణ్, సాయిబాబు, అప్పారావు, రమేష్, రామ్మోహన్, రాజశేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగాధిపతి ఏఎస్ఎన్ రాధిక, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలి

» కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 7: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వివిధశాఖల అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడునెలలకు ఒకసారి వికాస సంస్థ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి ఆయా సంస్థలకు రక్తాన్ని సరఫరా చేస్తోందన్నారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు అందించనున్నామన్నారు. ఈ సంస్థ ద్వారా ఉద్యోగం, శిక్షణ నిమిత్తం వచ్చే యువతకు రక్తదానం ఆవశ్యకత వివరించి స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన వారికి అందించే పత్రాల ద్వారా భవిష్యత్తులో వారి కుటుంబంలో ఎవరికైనా రక్తం అవసరమైనప్పుడు రుసుం లేకుండా రక్తాన్ని సరఫరా చేస్తామన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు మాట్లాడుతూ ఇప్పటివరకు వికాస ద్వారా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 245మంది రక్తదానం చేశారని, ఈ శిబిరంలో 60మంది యువత పాల్గొని రక్తదానం చేశారని అన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి సందర్శిస్తున్న కలెక్టర్, రెడ్‌క్రాస్ ఛైర్మన్

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ వైడీ రామారావు, వికాస మేనేజర్ పి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగం కేసులో 8మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 7: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకం పొందిన ఓ మహిళ, ఆమె కుటుంబసభ్యులు, వారికి సహకరించిన మున్సిపల్ ఉద్యోగులు మొత్తం 8మందిపై నేరారోపణ రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్న లక్ష్మి ఒక్కొక్కరికి మూడేళ్ల చొప్పున జైలుశిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రేచర్లపేటకు చెందిన కొల్లాబత్తుల వెంకటరమణ కాకినాడ మున్సిపాలిటీలో ఉద్యోగం చేసేవాడు. అతడు అనారోగ్య కారణంగా 2012లో మృతిచెందాడు. కాగా మృతుడి భార్య అరుణకుమారి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండేది. అదే అదునుగా చూసుకుని అరుణకుమారి అత్త వారి కుటుంబసభ్యులంతా ఏకమై ఆమె తోటికోడలైన కొల్లాబత్తుల లక్ష్మిని అరుణకుమారిగా చూపించి అందుకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలను సృష్టించారు. లక్ష్మిని అరుణకుమారిగా చూపించి కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకం పొందారు. మృతుడు వెంకటరమణకు రావాల్సిన రాయితీలన్నీ లక్ష్మి దక్కించుకుంది. గల్ఫ్‌నుంచి కాకినాడకు వచ్చిన అరుణకుమారి జరిగిన వ్యవహారం అంతా తెలుసుకుని పూర్తిఆధారాలతో 2012, ఏప్రిల్ 10న కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్‌హెచ్‌ఓ డీఎస్ చైతన్యకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులైన కొల్లాబత్తుల అప్పయ్యమ్మ, కొల్లాబత్తుల లక్ష్మి, కొల్లాబత్తుల గోపి, కొల్లాబత్తుల శ్రీనివాస్‌రావ్ కొల్లాబత్తుల శారద, కిలిమి వీరరాఘవరెడ్డి, నీలాపు రమణ, సాడి సత్యనారాయణలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల్లో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోసాల కమలకుమారి వ్యవహరించారు.

ఇంటర్ పరీక్షలు
ప్రశాంతంగా నిర్వహించాలి

అధికారులతో సమావేశమైన డీఆర్వో నరసింహులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పగడ్బందీగా నిర్వహించడానికి పూర్తి సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మూడు దశల్లో జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20 వరకూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాల్లో 19,336 మంది మొదటి ఏడాది, 18,166 మంది రెండో ఏడాది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 3,802 మంది పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం ద్వారా జారీ అయిన ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. విద్యుత్ నిరంతరాయంగా ఉండాలని, జనరేటర్లను కూడా సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మెడిసిన్స్, అత్యవసర సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సుల వేళలను మార్పు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంటరాక్ట్ ప్రోగ్రామింగ్ చేసే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని, అందువల్ల వాటిని విద్యార్థులు తీసుకురావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఆర్టీసీ ఏఎం ఎం.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

కొవ్వూరులో శోభాయాత్ర

ప్రత్యేక పూజల నిర్వహణ

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ మహోత్సవాలను పురస్కరించుకుని కొవ్వూరు గౌడీయామఠం స్వామీజీ శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. కొవ్వూరు లాంచీల రేవు వద్ద ఉన్న శ్రీ రామానంద గౌడీయామఠంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ వీధులలో శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో 108 కలశాలతో నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు మాట్లాడుతూ ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు గౌడీయామఠంలో భాగవత సప్తాహములు, త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు తిరోభావము, శ్రీశ్రీకృష్ణవసంత పంచమి, శ్రీవిష్ణుప్రియ ఆవిర్భావం, శ్రీల పుండరీక విద్యానిధి, శ్రీల రఘునందన ఠాకూరుల ఆవిర్భావములను పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీపాద భక్తిప్రమోద జనార్ధన మహరాజు, శ్రీపాద రమణ కృష్ణదాస్ పాల్గొన్నారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వామీజీ

144 అడుగుల ఆంజనేయ
విగ్రహ స్థాపనకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

రాజానగరం, ఫిబ్రవరి 7: జాతీయ రహదారిని ఆనుకుని వెలుగుబంద పరిధిలోని దత్త ఆశ్రమం ప్రాంగణంలో రూ.10 కోట్లతో నెలకొల్పనున్న 144 అడుగుల బృహదాకార కార్యసిద్ధి శ్రీఅంజనేయస్వామి వారి విగ్రహ స్థాపనకు మైసూరు దత్తపీఠాధీశులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ బుధవారం భూమిపూజ చేశారు. మహావీర్ హనుమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా తొలుత వాస్తు పూజ, విశ్వ దేవత హోమం, భూమిపూజ క్రతువులు వేదమంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా నిర్వహించారు. జైశ్రీరామ్, జైశ్రీరామ్ నినాదాలతో ఆశ్రమ ప్రాంగణం మార్మోగింది. గణపతి హోమం, వాస్తు హోమం, మన్యుసూక్త సహిత రామతారక హోమం చేపట్టారు. అనంతరం బృహదాకార హనుమ విగ్రహ శంకుస్థాపన మహోత్సవ క్రతువును కన్నుల పండువగా నిర్వహించారు. పాతాళంలో సూక్ష్మ ఆంజనేయ, మధ్యలో చిన్న ఆంజనేయస్వామి విగ్రహాలు కూడా విరాట్ ఆంజనేయ స్వామి విగ్రహం చెంతన రూపుదిద్దుకోనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ నెల 18న కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చిన జీయర్ స్వామివారి చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ షర్మిలారెడ్డి, ఇన్నమూరి దీప, తోట సుబ్బారావు, గూడూరి రాధిక, అశ్విన్ జవార్, పంతం కొండలరావు, కేఎల్ఎస్ రెడ్డి, మేడి త్రిమూర్తులు, లంక సత్యనారాయణ, వీరబాబు, రామరాజు, వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు, ఇలపకుర్తి కామేశ్వరరావు, సోడసాని తాతబ్బాయి, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత
పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: ఐదు దశాబ్దాల క్రితం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా బుధవారం స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు. 1974లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వీరంతా తాము చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలతో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. డాక్టర్ డి.రామచంద్రరావు స్వగృహం వద్ద నిర్మించిన సాంస్కృతిక కళా వేదికపై ప్రదర్శనలు నిర్వహించి సందడి చేశారు. కామాక్షి ప్రేమ మందిరం, స్థానిక అంధుల పాఠశాలలో విద్యార్థులకు తమ వంతు సాయం అందించారు. అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కొత్తూరి శ్రీమన్నారాయణ వృద్ధాప్యం లో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. సాయంత్రం భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. కార్యక్రమాన్ని నడిపించిన పూర్వ విద్యార్థులు శిష్లా రామగోపాలం, డాక్టర్ దుంగా వెంకట్, మహ్మద్ ఆజామ్, కర్రా రామకృష్ణ, పెమ్మరాజు విజయ్, పి.రమణ, మంగిపూడి ప్రసాద్, భువనేశ్వరిను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిక్కవోలు, ఫిబ్రవరి 7: బిక్కవోలు గ్రామంలో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆటోలో తరలిస్తున్న 600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కెఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ బియ్యాన్ని గ్రామంలోని చలపతి ప్రసాద్, ఇంటి రాంబాబు కిలో రూ.20లకు కొనుగోలు చేసి తమ చేపల చెరువుల్లో దాణాకు వినియోగిస్తున్నారన్నారు. ఈ బియ్యం విలువ రూ. 2.27 లక్షలు ఉంటుందన్నారు. సివిల్ సప్లయ్స్ అధికారులు ఆటోను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి సదరు వాహనం యజమాని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయుటకు బిక్కవోలు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేశారన్నారు. కార్యక్రమంలో డీటీ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 7: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ఉదయం ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా 2024 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వర్మ తెలిపారు. గవర్నమెంట్ ఐటీఐ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్స్‌లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8639230775 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరం



రైతు సదస్సులో మాట్లాడుతున్న శివకుమార్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 7: కొబ్బరి చెట్లను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరమని, జీవ నియంత్రణ విధానాలే క్షేమదాయకమని అఖిల భారత కొబ్బరి సమన్వయ పథకం జీవ నియంత్రణ విభాగం (బెంగళూరు) నోడల్ అధికారి పి.శివకుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో సర్పంచ్ చిక్కం జంగమయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన కొబ్బరి రైతుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొబ్బరి చెట్లను నల్లముట్టి పురుగు ఆశించడంతో ఆదాయం కోల్పోయిన సన్నవిల్లి రైతులను ఆదుకునేందుకు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నోడల్ అధికారిని రప్పించి పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించారు. శివకుమార్ మాట్లాడుతూ అవసరాన్ని అనుసరించి బ్రాకాన్ బ్రెవికార్నిస్, గొనియోజస్ నెఫాంటిడిస్ మిత్ర పురుగులను ప్రయోగించడం ద్వారా నల్లముట్టిని తుదముట్టించవచ్చన్నారు. అయితే బదనికకు కనీసం రూపాయి వంతున ఎకరాకు రూ.300 రైతులు వాటాగా చెల్లిస్తే బదనికల సరఫరా సాధ్యపడుతుందని కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సెంటిస్ట్ ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు అంబాజీపేట పరిశోధనా కేంద్రం నుంచే మిత్ర పురుగులను పంపిణీ చేస్తామన్నారు. అందరూ చిన్నకారు రైతులేనని, ఉచితంగా బదనికలు ఇవ్వాలని సర్పంచ్ జంగమయ్య కోరారు. ఇందుకోసం అంబాజీపేట కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చాలని నోడల్ అధికారి శివకుమార్‌ను సర్పంచ్ అభ్యర్థించారు. తన వంతు ప్రయత్నిస్తానని శివకుమార్ భరోసా ఇచ్చారు. నల్లముట్టి పురుగు వ్యాప్తి, లక్షణాలు, సామూహిక నివారణ పద్ధతులపై ఎంటమాలజిస్టు వి.అనూష రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం శివకుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు కొబ్బరి చెట్లపై మిత్ర పురుగులను ఎలా వదలాలో రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. సదస్సులో ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, చిక్కం నాగబాబు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి బీవీ రమణ, ప్లాంట్ పేథాలజీ సైంటిస్టు బి.నీరజ, ఉద్యానవన శాఖాధికారిణి ఎం.శైలజ, మాజీ సర్పంచ్ గనిశెట్టి వీరాస్వామినాయుడు, గనిశెట్టి సద్గురురావు, నిమ్మకాయల రాము పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈనెల 20న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ వైదిక కమిటీ సభ్యులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమావేశమయ్యారు. సుమారు లక్ష మంది విచ్చేస్తారని, 15 వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీనికనుగుణంగా రెండుగంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూలైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని భక్తులకు పులిహోర, దద్దోజనం ప్రసాదాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కృష్ణప్రసాద్, కంచి మూర్తి, బలువు సత్యశ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు బాలమురళీ, నరసింహారెడ్డి, టీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక ఎక్సైజ్ కేసులు పరిష్కారమవ్వాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. సమావేశంలో తూర్పు గోదావరి సెబ్ అడిషనల్ ఎస్పీ వి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సెక్టార్, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. సెక్టారు అధికారులు తరచూ పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డీటీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్, చెల్లాయమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయుడుపాలెంలో వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే చంపేశాడని తల్లిదండ్రుల ఆరోపణ

అరెస్టు చేయాలంటూ జీజీహెచ్ వద్ద ఆందోళన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలానికి చెందిన వివాహిత బొండాడ హారికాలక్ష్మి (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, అదనపు కట్నం కోసం వేధిస్తూ, చివరకు కట్టుకున్న భార్యను పీకకు ఉరేసి చంపేసి ఆత్మహత్యగా భర్త చిత్రీకరించాడని హారిక తల్లిదండ్రులు గొర్ల రాజు,మణి ఆరోపించారు. తక్షణమే అల్లుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని జీజీహెచ్ వద్ద ఆందోళన చేపట్టారు. రాయుడుపాలెం, పిఠాపురానికి చెందిన బొండాడ జాషువ, హారిక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహం జరిగిన కొద్దిరోజుల నుంచి అదనపు కట్నం కోసం భార్యను జాషువా వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో హారిక స్నానం చేయడానికి వెళ్లగా కరెంట్ షాక్ తగిలి చేతులు మెడ, కాలిపోయిందని, ఆసుపత్రికి తీసుకెళుతున్నట్లు హారిక తల్లిదండ్రులకు జాషువ సమాచారం అందించి, జీజీహెచ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు సోమవారం సాయంత్రం హారిక మృతి చెందింది. అదనపు కట్న కోసం కావాలనే తమ కుమార్తె మెడకు ఉరేసి, చేతులు కాల్చివేసి కరెంట్ షాక్ నెపంతో తమ అల్లుడు హత్యకు పాల్పడి నాటకం ఆడుతున్నాడని హారిక తల్లిదండ్రులు ఆరోపించారు. బుధవారం జీజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేశారు. అరెస్ట్ చేసే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు అనుమతించడం కుదరదంటూ పోలీసులకు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపారు.



ఊయలలో లేగదూడను ఉంచి పండుగ చేస్తున్న దృశ్యం

లేగదూడకు ఊయల వేడుక

పెరవలి, ఫిబ్రవరి 7: పెరవలి మండలం ముక్కామలకు చెందిన అఖండ వెంకటేశ్వరరావు గోవులను ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటారు. దీంతో ఆయన వద్ద ఉన్న ఆవుకు ఒక దూడ కూడా పుట్టింది. ఈ మేరకు 21వ రోజున ఉయ్యాల వేడుకను ఘనంగా నిర్వహించారు.శాస్త్రోత్తంగా ఊయల ఏర్పాటు చేసి పూలతో అలంకరించి ఆ ఊయాల్లో దూడను ఉంచి ఎంతో ఆనందంగా వేడుకలు జరిపారు. బంధువులు తరలివచ్చి ఆశీర్వదించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.68 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,544 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి..భర్తకు తీవ్రగాయాలు



బైక్‌ను ఢీకొన్న లారీ

పిఠాపురం, ఫిబ్రవరి 7: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లి మండలం కొత్తమూలపేటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చిందాడ నాగేశ్వరరావు తన భార్య అపర్ణ(40)కు అనారోగ్యంగా ఉండటంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని మోటార్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద మలుపు తిరుగుతుండగా కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టింది. మోటార్‌సైకిల్‌ను 50 అడుగుల దూరం ఈడ్చుకువెళ్లింది. ప్రమాదంలో అపర్ణ అక్కడికక్కడే మరణించగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్, హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



అపర్ణ(ఫైల్ ఫోటో)

ఎడ్ల బండిని ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్ దుర్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కుక్కను తప్పించబోయి ఎడ్ల బండిని ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన మల్లిన సత్యనారాయణ (45) ప్రతిరోజు మల్లవరం నుంచి రాజమహేంద్రవరం సర్వీస్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా ఈ నెల 6వ తేదీన సత్యనారాయణ రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కొవ్వూరు మండలం వేములూరు సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటోతో ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సత్యనారాయణకు ఎడ్లబండి కాడ తలకు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సత్యనారాయణ భార్య పద్మ ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం షాపు తరలించాలని ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని 14వ వార్డు పరిధిలో శ్రీరాంపురంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తరలించాలంటూ స్థానిక మహిళలతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు రెండో రోజైన బుధవారం ధర్నా కొనసాగించారు. ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆ ప్రాంత ప్రజలు వివరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ కౌన్సిలర్ వానంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఎక్సైజ్ అధికారులతో పాటు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకుని వారితో చర్చలు జరిపారు. త్వరలోనే షాపును అక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, ఫిబ్రవరి 7: వేళంగి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా వేళంగి, కొప్పిశెట్టివారిపేట, కూరాడ, చినమామిడాడ, సిరిపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గుర్తించి సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

'ఎస్సీ వర్గీకరణకు కట్టుబడే పార్టీలకే మద్దతు'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 7: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు కట్టుబడే పార్టీలకే మాదిగల మద్దతు ఉంటుందని ఏపీ-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల రవి అనంతకుమార్ వెల్లడించారు. బుధవారం శాంతిభవన్ సమావేశహాల్‌లో ఏపీ-ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో రవి అనంతకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై విచారణ చేపట్టిందన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ విషయంలో మాదిగలకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానాల్లో ఒకటి మాదిగలకు, ఒకటి రెల్లి కులస్థులకు కేటాయించాలన్నారు. కాకినాడ జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాల్లో ఒకటి ఎస్సీలకు కేటాయించాలన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ విషయంలో ఏపీ సీఎం వైఖరి ఏమిటో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మందపల్లి సత్యనారాయణ, పలివెల శివమణి, చాట్ర ఇమ్మానుయేలు, వేంద్ర రమేష్, కాకాడ జ్యోతికుమార్, దూలపల్లి వరనరసింహం తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం'

గండేపల్లి, ఫిబ్రవరి 7: వైసీపీ పాలనలో పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని మాజీ మంత్రి, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే సుజన కృష్ణరంగారావు మండిపడ్డారు. ఆయన వైజాగ్ వెళ్తూ గండేపల్లి మండలం మురారిలో ఆగి వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జాస్తి వసంత్, అనుచరులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా నాశనమైందన్నారు. తప్పుడు నిర్ణయాలతో ప్రజలు, అధికారులను ఎంతో ఇబ్బంది పెట్టారన్నారు. అందుకే ఆ పార్టీపై ప్రజా వ్యతిరేకత పెరిగి టీడీపీ అభివృద్ధి సాధ్యమని వలసల బాట పట్టారన్నారు. వైసీపీ పాలనపై సర్పంచ్‌లే అసంతృప్తిగా ఉన్నారని, ఈ పాలనను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన కలయికతో ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

'ఎన్నికల కరపత్రంలా రాష్ట్ర బడ్జెట్'

గొల్లప్రోలు, ఫిబ్రవరి 7: అసెంబ్లీలో వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఎన్నికల కరపత్రంలా ఉందని, వాస్తవికతను ప్రతిబింబించడం లేదని నిరసన ప్రకటిస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గొల్లప్రోలులో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేపట్టాలనే ఉద్దేశ్యంతో సీఎం జగన్ అంకెల గారడీకి దిగారన్నారు. కేటాయింపులు ఘనంగా ఉన్న ఒక్క రూపాయి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఖర్చు చేయడం లేదని విమర్శించారు. అధిక ధరలు, పన్నులతో ప్రజలు సతమతమవుతుంటే దానిపై బడ్జెట్‌లో అసలు ప్రస్తావనే లేదని చెప్పారు. ఆందోళనలో కేశవరపు వీరన్న, గుడాల చార్లెస్, గొర్ల శివ, బళ్ల సోమరాజు, మాదేపల్లి ఈశ్వరరావు, బర్రె లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ఈవీఎంలపై అవగాహన ఉండాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా సెక్టోరల్ అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. బుధవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో తహశీల్దార్ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో సెక్టోరల్ అధికారులతో ఈవీఎం, వీవీ ప్యాడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాడ్స్ తదితర సాంకేతిక పరిజ్ఞానంపై సన్నద్ధంగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో అవగాహన, ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ (రీసర్వే) వై.శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఏలూరు, పి.జగన్నాధపురం, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ గ్రామాల్లో బుధవారం ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధాన సమస్య అయిన ప్రత్యేక హోదా, రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తదితర సమస్యలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.సూర్యప్రకాశరావు, కొల్లు వీరగణేష్, కొప్పన కోటేశ్వరరావు, ఇనుమల రాజా, పి.పెదబాబు, డి.రాజబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాల్లో అనేక అవకతవకలు జరిగాయని, చనిపోయిన వ్యక్తుల పేర్లు, డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఓటర్ల లిస్ట్ తయారు చేశారని, తక్షణం పరిశీలన చేసి పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ జనసేన ఇన్‌చార్జి పంతం నానాజీ ఆదేశాల మేరకు కుమారుడు సందీప్, మండలాధ్యక్షుడు కొరెడ్ల గోవిందు, జిల్లా కార్యదర్శి సోదె ముసలయ్య బుధవారం ఓటర్ల జాబితాలోని 39 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన 32 డబుల్‌ఎంట్రీలు, మృతి చెందిన వారి 386 ఓట్లు ఆధారాలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో ఇట్ల కిషోర్‌కు అందజేశారు. విచారణ నిర్వహించి మృతుల ఓట్లు తొలగింపుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

కిర్లంపూడి, ఫిబ్రవరి 7: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఓటు ఫర్ ఓపీఎస్ అంటూ రూపొందించిన పోస్టర్‌ను బుధవారం మండలంలోని తామరాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలిన నూకరాజు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తామని, ఇచ్చినహామీని నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ సంఘం పిలుపుమేరకు ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదాన్ని ఉద్యోగుల్లో తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆర్ఎంఎస్‌బీ కుమార్, వీర్రాజు, కస్తూరిబాయ్, రామ్మోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.

'సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం'

పిఠాపురం, ఫిబ్రవరి 7: మహామంత్ర, ధ్యాన, జ్ఞాన సాధనలతో కూడిన త్రయీసాధన ద్వారా ఆధ్మాతికతత్వాన్ని ప్రభోదిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. పిఠాపురం శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఈనెల 9,10,11న నిర్వహించే పీఠం వార్షిక మహాసభలకు సంబంధించిన వివరాలను బుధవారం విలేకర్ల సమావేశంలో ఉమర్‌ఆలీషా వెల్లడించారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి పీఠం మహాసభల్లో పాల్గొనేందుకు భక్తులు వస్తారని తెలిపారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏసత్యనారాయణ, ఎన్టీవీ ప్రసాదవర్మ, పింగళి ఆనందకుమార్, రమేష్ పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ నిలిపివేయాలి'

అమీనబాద్ (కొత్తపల్లి), ఫిబ్రవరి 7: తమ గ్రామానికి చెందిన స్థలంలో ఇతర గ్రామాలవారికి జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేయడాన్ని తక్షణం నిలిపివేయాలని అమీనబాద్ గ్రామస్తులు గ్రామ సచివాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు, అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అధికారుల సమన్వయంతో గ్రామస్తులు జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద సమస్యను వివరించేందుకు వెళ్లడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బావిలో మృతదేహం వెలికితీత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామంలో ఒక బావిలో పడి ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం స్థానిక పోలీసులు వెలికితీశారు. ధర్మవరంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వెనుక ఉన్న శిథిల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. 35ఏళ్ల పైబడి ఉన్న వ్యక్తి మృతదేహం పాడైపోవడంతో గుర్తుటతెలియని విధంగా ఉండడంతో వారం క్రితమే బావిలో పడి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆసరా' చెక్కు అందజేత

రౌతులపూడి, ఫిబ్రవరి 7: మండల పరిషత్ కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఆసరా పథకంలో డ్వాక్రా 799 సంఘాలకు విడుదలైన రూ.5,15,18,926 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గొల్లు చినదివాణం, వైసీపీ నేత వాసిరెడ్డి జేమీల్, సర్పంచ్ కటారి అర్జమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు చింతకాయల సత్యనారాయణ, మండల వ్యవసాయ కమిటీ సలహాదారుడు వాసిరెడ్డి భాస్కరరావు, వాసిరెడ్డి కృష్ణ, ఆసుపత్రి డైరెక్టర్ కేదారశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విసుగుతో వెనుదిరిగిన డ్వాక్రా మహిళలు

సామర్లకోట, ఫిబ్రవరి 7: మండలంలోని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురం కొత్త లేఅవుట్ వద్ద ఆసరా పథక నాల్గో విడద సాయం పంపిణీ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు విసుగుతో వెనుతిరిగారు. ముఖ్య అతిథి పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కోసం మూడు గంటలకు పైగా చూసి విసుగుచెంది కుర్చీల నుంచి లేచి ఇంటికి తిరుగుముఖం పట్టారు. వారిని నిలువరించేందుకు పోలీసులు, డ్వాక్రా సీఆర్పీలు, వీఏవోలు, ఏపీఎం చేసిన ప్రయత్నాలు ఉపయోగపడలేదు.

బీసీలను మోసం చేసిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

తాళ్లరేవు, ఫిబ్రవరి 7: బీసీలను, బడుగుబలహీన వర్గాలను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. బుధవారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయం ఆవరణలో జయహో బీసీ మహాసభ జిత్తుక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇళ్ల స్థలాలు, పట్టాలు, ఇసుక, మద్యం ఇలా అన్నింటిలో అవినీతి జరిగిందన్నారు. జనసేన కోఆర్డినేటర్ పితాని బాలకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతిని టీడీపీ,జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన వెంటనే కక్కిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద మాట్లాడుతూ జనసేన, టీడీపీ కూటమితో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. బీసీ నేతలు గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, నాగిడి నాగేశ్వరరావు, పెచ్చేటి చంద్రమౌళి, టేకుమూడి అనంతలక్ష్మి, జనసేన నేతలు అత్తిలి బాబూరావు, గుడాల శ్రీనివాస్, సానబోయిన వీరభద్రరావు పాల్గొన్నారు.



తాళ్లరేవు సభలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడలో జయహో బీసీ సభ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 7: నగరంలోని దుమ్ములపేటలో మంగళవారం రాత్రి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. వివిధ ప్రాంతాలనుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. దుమ్ములపేటలోని 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సభకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యనమల కృష్ణుడు, కాకినాడ నియోజకవర్గ పరిశీలకుడు నాగిడి నాగేశ్వరరావు, కాకినాడ రూరల్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కాదా వెంకటరమణ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్, పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, జిల్లా మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ కోడా రమణ, కాకినాడ రామారావు విచ్చేశారు. కొండబాబు మాటాడుతూ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి టీడీపీ తెచ్చిన 30 పైగా బీసీ సంక్షేమ పథకాలను రద్దు చేసి దగా చేశాడని, బీసీల పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీతోనే వారి ప్రగతి సాధ్యమని అన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు వొమ్మి బాలాజీ, నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, ఏపీడీ మెంటారావు, దండుప్రోలు నాగబాబు, తుమ్మల సునీత, చోడిపల్లి సతీష్, ఎరిపల్లి రాము, మూగ రాజు, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, నాగేశ్వరరావు ఉన్నారు.



కాకినాడ సభలో టీడీపీలో చేరిన స్థానికులు

ప్రతీ ఎకరానికి సాగునీరందేలా చర్యలు

» ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల పెంపు » ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు

పిఠాపురం, ఫిబ్రవరి 7: శివారు ఆయకట్టులోని ప్రతీ ఎకరానికి సాగునీరందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను తక్షణం పెంచుతామని చెప్పారు. ఏలేరు, పీబీసీ శివారు ఆయకట్టు పొలాలకు సాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగక నీటి ఎద్దడి ఏర్పడి రైతులు పడుతున్న ఇబ్బందులను కాకినాడ ఎంపీ, వైసీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్, జిల్లా కలెక్టరు కృతికాశుక్లా, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టరు, ఎంపీ గీత ఆదేశాలతో ఎస్ఈ శ్రీనివాసరావు ఇరిగేషన్ అధికారులు, రైతు ప్రతినిధులతో కలిసి కాండ్రకోట రెగ్యులేటర్ నుంచి పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల పిడింటొడ్డి రెగ్యులేటర్ వరకూ బుధవారం పర్యటించారు. పి.దొంతమూరు, రాయవరం, రాపర్తి, బోగాపురం, బి.ప్రత్తిపాడు, గొల్లప్రోలు, ఇల్లింద్రాడ, విరవాడ, ఎల్ఎస్‌పురం గ్రామాలతో పాటు పిఠాపురం పట్టణ పరిధిలోని పంటపొలాలును, రెగ్యులేటర్లు, కళింగల్స్, కాలువలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సాగునీటి లభ్యతపై ఆరా తీశారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, దీనిని 1100 క్యూసెక్కులకు పెంచాలని ప్రాజెక్టు ఈఈని ఎస్ఈ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఉదయానికి ఈ నీరు ఆయకట్టుకు చేరుతుందని తెలిపారు. శివారులోని పంటపొలాలుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేవరకూ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని ఎస్ఈ చెప్పారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ డీవీ రామగోపాల్, సామర్లకోట, పిఠాపురం డీఈఈలు శ్రీనివాస్, కాశి సురేష్, ఏలేరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తెం బాబూరావు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు రావుల మాధవరావు, పలువురు రైతులు ఉన్నారు.



ఏలేరు శివారు ఆయకట్టు పొలాలు పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు

'ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 7: పట్టుగూళ్ల విక్రయానికి సంబంధించి రైతులకు రావాల్సిన ఇంటెన్సివ్ బకాయిలు రూ.1.80కోట్లుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టరు బీఎంవీ రామరాజు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారంలో బుధవారం పట్టురైతుల సదస్సు నిర్వహించారు. ఊజీ ఈగల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇప్పటికే రూ.37లక్షలను రైతుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. చేబ్రోలు పట్టుగూళ్ల మార్కెట్‌లో గతేడాది 115.54 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్లను రైతులు విక్రయించగా, ఈ ఏడాది ఇప్పటి వరకూ 122.23 టన్నుల పట్టుగూళ్లను విక్రయించినట్లు డీడీ తెలిపారు. మార్కెట్‌కు స్థానిక రీలర్లతో పాటు మదనపల్లి, కదిరి, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక అధికారి కందా లక్ష్మీనారాయణ, విశ్రాంత అధికారి కోటిలింగేశ్వరరావు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రత్తిపాడు కొత్తపేట పరిసరాల్లో బుధవారం ఆమె మీ కోసం మీ ఇంటింటికిమీ సత్యప్రభ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, పల్లా గోపి, యాళ్ళ జగదీష్, ఇళ్ళ అప్పారావు, పోలిశెట్టి శ్రీనివాస్, తటవర్తిసుబ్బారావు, మంతెన శ్రీను, వెలుగుల నాని, యర్రాబత్తుల గోవిందనాయుడు, యాళ్ళ విశ్వేశ్వరరావు, అంబటి బూరయ్య, అంబటి దుర్గ, మదినే దొరబాబు, చిలకమర్తి వీరభద్రం,అప్పికొండ కిశోర్, నానిశెట్టి ప్రసాద్, శెట్టిబత్తుల వీరబాబు, గోపిశెట్టి శ్రీను, జెండా రాజేంద్ర, తొండా లోవరాజు పాల్గొన్నారు.

యనమల దివ్య ప్రచారం

తుని రూరల్, ఫిబ్రవరి 7: ఇంటింటా ప్రచారంలో భాగంగా వి.కొత్తూరులో తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి ప్రచారం చేపట్టారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేసి ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మాజీ సర్పంచ్‌లు తమరాన రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ తాతలు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ పాల్గొన్నారు. తుని 27వ వార్డులో దివ్య ప్రచారం చేపట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, సిద్ధాంతపు సత్తిబాబు, అల్లురాజు, మళ్ళ గణేష్, శిల్పారశెట్టి జగన్మోహన్, దిబ్బ శ్రీను తదితరులున్నారు.

టీడీపీలోకి చేరిక

తుని రూరల్, ఫిబ్రవరి 7: తునిలో ట్రాక్టర్ యూనియన్ల డ్రైవర్లు, కార్మికులు టీడీపీలోకి చేరారు. యూనియన్ ప్రతినిధి తాటిపాక సత్తిబాబు, సిద్ధాంతపు శ్రీనుబాబు, చిట్టుమూరి బుజ్జి, బోడపాటినూకరాజు, టి.సింహాచలం, కాళ్ళ తలుపులు, శెట్టిబత్తుల బలరాజు, కొల్లాబత్తుల మురళి, పలువురు కార్మికులకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు మళ్ళ గణేష్, సిద్ధాంతను సత్తిబాబు, అల్లురాజు, జల్లువాసు, దిబ్బ శ్రీను పాల్గొన్నారు.

139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో 139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చర్యలు చేపట్టినట్లు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి, సబ్ కలెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 45 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఎన్నికల ప్రక్రియకు అన్ని విధాలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సింగిలిదేవ్ సత్తిరాజు, శేరు కృష్ణ, ధర్మాలకోట శ్రీను, మదినే బాబ్జి, రొంగల ఈశ్వరరావు, మానుకొండ లచ్చబాబు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

తొండంగి, ఫిబ్రవరి 7: తుని నుంచి గొల్లప్రోలు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బుధవారం తెల్లవారుజామున గొల్లప్రోలుకు చెందిన చంద్రశేఖర్, మరో ఇద్దరు తుని వెళ్లి తిరిగి వస్తుండగా తమ్మయ్యపేట వద్ద అదుపు తప్పి డివైడర్ మీదికి దూసుకు వెళ్లింది. వారికి స్వల్పగాయాలు అయ్యాయి.

భూసేకరణలో భారీగా అవినీతి : వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 7: పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన భూసేకరణలో భారీగా అవినీతి జరిగిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పిఠాపురంలో పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు సేకరించిన 55 ఎకరాల పంటపొలాలును ఆయన పరిశీలించారు. ఎక్కడిక్కడ మోకాలి లోతు నీరు నిలిచిపోయి నివాసయోగ్యం లేకుండా ఉన్న భూములను చూపిస్తూ ఈ గోతుల్లో ఇళ్లస్థలాలు ఎలా ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. కనీసం 10 అడుగుల ఎత్తు చేసిన తర్వాతే స్థలాలుగా ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. భూసేకరణలో అధికార పార్టీ ప్రతినిధులు ఎకరానికి రూ.15లక్షల వరకూ కమిషన్లు నొక్కేసారని, ఇళ్లస్థలాలు పేరుతో రూ.20కోట్లు మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. గొల్లప్రోలులోని జగనన్న కాలనీకి ఏడాదిలో సగం సమయం వెళ్లేందుకు దారి ఉండదని, వర్షం ఎక్కువ పడితే ముంపునకు గురవుతున్నదని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, నకుమళ్ల గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, దేవరపల్లి రామారావు, పిల్లి చిన్నా, బర్ల అప్పారావు, ఎలుబండి రాజారావు, సోము సత్యనారాయణ, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీను, ఓగేటి మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల్లో నీటిని చూపుతున్న వర్మ

'పొరుగు నేతలను నమ్మకండి'

గొల్లప్రోలు: ఎన్నికల ముందు అధికారం కోసం వచ్చే పొరుగు నేతలను నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలు 12, 15వ వార్డుల్లో పర్యటించి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ పట్టణాధ్య క్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ ఛైర్‌పర్సన్ శీరం మాణిక్యం, కౌన్సిలరు గుళ్ల సుబ్బారావు, గంటా చంద్రరావు, బస్వా సత్యనారాయణ, కదారి బాబ్జి, పేకేటి చక్రధరరావు, దువ్వా తాతాజీ, గండే నాగేశ్వరరావు, పర్వత సురేష్, వెన్నా బాపిరాజు, బస్వా నాగేశ్వరరావు, రమణ, నాగమళ్ల త్రిమూర్తులు, గిడుతూరి బాబూరావు తదితరులున్నారు.

దళిత సంఘాల ప్రతినిధుల ఆందోళన

పిఠాపురం, ఫిబ్రవరి 7: రాజకీయ ప్రాబల్యం కోసం జనసేన నాయకులు ఎస్సీ యువకులను తప్పుడు కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాల ప్రతినిధులు పిఠాపురం ఇందిరానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. మాల మహానాడు పట్టణ ఉపాధ్యక్షుడు మైనబత్తుల అప్పలరాజు(చిన్న) మాట్లాడుతూ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు కూలి పనులకు వెళ్తూ కత్తులు, ఇతర సామాగ్రి తీసుకువెళ్లారని.. అదే సమయంలో జనసేన కార్యాలయం వద్ద ఉన్న ఆ పార్టీ నేత మాదేపల్లి శ్రీనివాసరావు తనను హత్య చేసేందుకు రెక్కీ చేశారంటూ యువకులపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేసి జనసేన ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, యువకుల తల్లిదండ్రులు కలిశారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: ఏలేశ్వరం మండల జె.అన్నవరం పీహెచ్‌సీని వినియోగంలోకి తీసుకురావాలని, యర్రవరంలో నూతనంగా పీహెచ్‌సీని మంజూరు చేయాలని ఏలేశ్వరం మండల సర్వసభ్యసమావేశం తీర్మానించింది. ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తిరుమాలి, లింగంపర్తిల్లో రూ.6లక్షలతో నిర్మించే సిమ్మెంటు రహదారి నిర్మాణాల మంజూరుకు తీర్మానాలు చేశారు. జడ్పీటీసీ నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, వరుపుల దుర్గావేణి, అలమండ నాగు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సాయం

తాళ్లరేవు, ఫిబ్రవరి 7: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కిడ్నీ బాధితురాలు కట్టా మంగాలక్ష్మికి టీడీపీ గ్రామకమిటీనేతలు, శెట్టిబలిజ యూత్ సభ్యులు రూ.20,000 ఆర్థిక సాయం బుధవారం అందించారు. కూతురు మేడిశెట్టి సత్యశ్రీకి కిడ్నీలు పాడైపోవడంతో తల్లి కట్టా మంగాలక్ష్మి కిడ్నీ దానం చేసింది. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, నేతలు పంపన పాండురంగా, దొమ్మేటి శోభన్‌బాబు, గుత్తుల సత్తికొండ, దొమ్మేటి వెంకటరమణ, దున్నా గౌతమ్‌సాహూ, మొగలతుర్తి శ్రీనివాస్, పెచ్చేటి సుబ్బారావులు చేతులు కలిపి సాయం అందించారు.

ఆశాలను అడ్డుకున్న పోలీసులు

శంఖవరం, ఫిబ్రవరి 7: కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్లు డిమాండ్లతో ఆశావర్కర్లు బుధవారం చలో విజయవాడ కార్యక్రమానికి పయనమవ్వగా పోలీసులు అడ్డకుఉన్నారు. బుధవారం శంఖవరం ఆసుపత్రిలో విధులను నిర్వర్తించి తిరిగి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు నిర్బంధించారు. ముందస్తు అరెస్టులను నిరసిస్తూ ఆశా వర్కర్లు నినాదాలు చేశారు.

సీఐటీయూ నేతలను...

సామర్లకోట, ఫిబ్రవరి 7: సామర్లకోట పట్టణ పరిధిలో సీఐటీయూ నాయకులను పోలీసులు గృహ నిర్బంధించడం, పోలీస్‌స్టేషన్‌కు తరలింపు వంటి అదుపు చర్యలు తీసుకున్నారు. విజయవాడలో ఆశా వర్కర్ల ధర్నాకు సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి ఎవరూ తరలివెళ్లకుండా పెద్దఎత్తున పహారా కాశారు.

కాకినాడలో 'మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 7: పేర్రాజుపేటలో జనసేన పార్టీ సిటీ జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పీఏసీ సభ్యులు, సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ చర్యలని జనసేన తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, వీరమహిళలు ఉన్నారు.

'కాంగ్రెస్ విజయానికి కృషి'

జగ్గంపేట, ఫిబ్రవరి 7: ఏపీ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా మరోతి శివగణేష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, వైఎస్‌షర్మిలా రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజుకు శివగణేష్ కృతజ్ఞతలు తెలిపి పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

'విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు అల్బెండజోల్ మాత్రలు'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: విద్యార్థుల ఆరోగ్యం సంరక్షణ కోసం 19 ఏళ్లలోపు వారు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా అవగాహనకల్పించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కాలేజీల ప్రధానోపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. 19 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యసిబ్బంది ద్వారా అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని, వీటిని మింగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి మాత్రల బాక్స్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, పండూరు, తూరంగి పీహెచ్‌సీ అధికారులు డాక్టర్ ఆయేషా ఫాతిమా, డాక్టర్ వసుంధర, సూపర్‌వైజర్లు మోహన్ పాల్గొన్నారు.

'నులిపురుగుల నివారణకు చర్యలు'

పెద్దాపురం, ఫిబ్రవరి 7: నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణీ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నులిపురుగుల నివారణకు సంబంధించి ఎంపీడీవో సమక్షంలో విద్యా, వైద్యశాఖాధికారులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అల్బెండజోల్ మాత్రల పంపిణీ సమర్థవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రమణ, కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రకిరణ్, ఎంఈవో చౌదరి, ఎంపీహెచ్‌ఈవో కాళ్లకూరి రామ్మోహన్ పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో నులిపురుగు నివారణకు అల్బెండజోల్ మాత్రలను ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జడ్పీటీసీ నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మిసొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు పంపిణీ చేశారు.

తొండంగి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నాడు చిన్నారులకు ఇచ్చేందేకు అల్బెండజోల్ మాత్రలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పసుపులేటి సతీష్, వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, వైద్యసిబ్బంది ప్రధానోపాధ్యాయులకు అందించారు. పిల్లలందరికి నూరుశాతం వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

డీవార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: నులిపురుగు నివారణకు ప్రతీ ఒక్కరూ టాబ్లెట్‌లను వేసుకోవాలని కొత్తపల్లి ఎంపీడీవో పి వెంకటనారాయణ అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో డీవార్మింగ్ డే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు సుష్మ, శ్వేత పాల్గొన్నారు.

'ఇంటి వద్దే విద్య అందించాలి'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 7: విభిన్న ప్రతిభావంతులయిన పిల్లలకు ఇంటివద్దే ప్రతి శనివారం హోమ్ బేస్‌డ్ విద్య అందించేలా చూడాలని సమగ్ర శిక్ష కాకినాడ జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలులోని మండల వనరుల కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించి కార్యాలయ, జీవీకే రికార్డులను తనిఖీ చేశారు. సహిత విద్యకు సంబంధించి భవిత కేంద్రాలను ఎంఈవోలు తప్పనిసరిగా సందర్శించాలని, వారానికి ఒకసారి ఫిజియోథెరపీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే దాట్ల పూజలు

తాళ్లరేవు, ఫిబ్రవరి 7: ఇంజరం ఉమాకృపేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అర్చకులు నామ నక్షత్రాలు వేదమంత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు సాగి వెంకట సుబ్బరాజు, వేగేశ్న భాస్కరరాజు, రేలంగి శ్రీకాంత్, శ్రీనురాజు,మోర్త భైరవమూర్తి ఉన్నారు.

ఏవోగా సుబ్రహ్మణ్యం

పెద్దాపురం, ఫిబ్రవరి 7: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ ఏవోగా కె.సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన శంఖవరం తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పవరకూ ఏవోగా పనిచేసిన వెంకటలక్ష్మీ కృష్ణా జిల్లా మొవ్వ బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఈయన ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆర్డీవో జె.సీతారామారావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

డీఎల్పీవో పరిశీలన

పెద్దాపురం, ఫిబ్రవరి 7: మండలంలోని ఆర్‌బీపట్నంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై సచివాలయంలో డీఎల్పీవో ఎం.బాలామణి బుధవారం పరిశీలించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, పీఎం విశ్వకర్మ, ఇంటి పన్నుల వసూళ్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు విషయాలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కాగితాల రాజశేఖర్ పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి కుర్చీల అందజేత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 7: మండలంలోని ధర్మవరం హైస్కూల్లో భవిత కేంద్రానికి రూ.5వేలు విలువ చేసే కుర్చీలు జువ్వల గనిబాబు అందజేశారు. గనిబాబును ఎంఈవో వి.రాజబాబు, సీఆర్పీలు రాంజీ ప్రసాద్, బాషా, గంగారావు, మల్లేష్ అభినందించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు కుమార్ రాజా, కృష్ణ , ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

'లోవ'లో షాపుల సీజ్

తుని రూరల్, ఫిబ్రవరి 7: లోవ దేవస్థానంలో పాటదారులుగా ఉండి ఆలయానికి చెల్లించాల్సిన డబ్బులు బకాలు పడడంతో అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. స్పందించని నిర్వాహకులపై అధికారులు చర్యలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో షాపులను సీజ్ చేసి ఘాటల్‌రోడ్‌లో టోల్‌గేట్‌లో ఆలయ అధికారులే బాధ్యతలు చేపట్టారు.